క్లుప్తంగా

యువత క్రీడల్లో పాల్గొనాలి



మొదటి స్థానంలో నిలిచిన జట్టుతో సర్పంచు, కో–ఆప్షన్ సభ్యుడు

కొత్తపల్లి: యువత క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మహమ్మద్ గౌస్ అన్నారు. శనివారం శివపురం గ్రామంలో కబడ్డీ పోటీలలో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి కొక్కెరంచ జట్టుకు రూ.7,016, రెండో బహుమతి లింగాపురం జట్టుకు రూ.5,016, మూడో బహుమతి నందికుంట జట్టు రూ.3,016 అందించారు. కార్యక్రమంలో నాగార్జున యాదవ్, శంకర్‌గౌడ్, శివన్న గౌడ్, నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కర్నూలు జిల్లా కోర్టు పీపీ వెంకటరెడ్డి

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కర్నూలు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరెడ్డి ఆయన స్వగ్రామమైన తరిగోపులలో శనివారం రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం రైతులు జరుపుకొనే గొప్పపండుగ అన్నారు. పండుగకు ఎక్కడెక్కడ ఉన్న వారంతా స్వగ్రామాలకు చేరుకొని కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి గడపడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సుజాత, యం.కృష్ణారెడ్డి, జయశేఖరరెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేష్‌కుమార్ రెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని సంరక్షించుకోవాలి



జలకనూరులో భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: హిందూ ధర్మాన్ని, సంస్కృతిని సంరక్షించుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని త్రైత సిద్ధాంత ప్రబోధన సేవా సమితి హిందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. శనివారం రోళ్లపాడు, జలకనూరు గ్రామాల్లో భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు.

సంక్రాంతికి ఆలయాలు ముస్తాబు



విద్యుత్ దీపాలంకరణలో తాండవమల్లేశ్వరస్వామి ఆలయం

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలోని ఆలయాలు సంక్రాంతి పర్వదినానికి ముస్తాబయ్యాయి. గువ్వలకుంట్ల, దుద్యాల, నందికుంట, శివపురం, ఎర్రమఠం గ్రామాలలో ఆలయాలు విద్యుత్ దీపకాంతులతో కళకళలాడుతున్నాయి. కొత్తపల్లి మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ పార్వతీసమేత తాండవమల్లేశ్వర కల్యాణమహోత్సవం సందర్భంగా స్వామివారి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

ఘాట్ల వద్ద బందోబస్తు



సిద్ధేశ్వరం ఘాట్ వద్ద పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్రంలోని కొల్లాపూర్ మండలంలోని సింగోటం జాతర సందర్భంగా సంగమేశ్వరం, సిద్ధేశ్వరం ఘాట్ల వద్ద కొత్తపల్లి పోలీసులు మరబోట్లు తిరగకుండా శనివారం పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు రెవెన్యూశాఖ వారి ఆధ్వర్యంలో మరబోట్ల నిర్వాహకులకు అవగాహన కల్పించి, బోట్లు తిరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. హెడ్‌కానిస్టేబుల్ శేషారామ్‌సింగ్, కానిస్టేబుల్ ప్రసాద్‌నాయక్, వీఆర్వో అశోక్, గ్రామ రెవెన్యూ సహాయకులు ఘాట్ల వద్ద పహారా కాస్తున్నారు.

క్రీడల్లో రాణించి పేరు తేవాలి

- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- ముగిసిన సంక్రాంతి క్రీడా సంబరాలు
- విజేతలకు షీల్డు, నగదు బహుమతుల ప్రదానం



స్టేజీ వద్దకు క్రీడాజ్యోతిని తెస్తున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

జూపాడుబంగ్లా: క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, నియోజకవర్గానికి మంచి పేరుతేవాలని శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న జగనన్న సంక్రాంతి క్రీడాసంబరాలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిద్ధార్థరెడ్డి క్రీడాజ్యోతిని తెచ్చి సభామండపం వద్ద ఉంచారు. అనంతరం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆతరువాత నిర్వహించిన కబడ్డీ ఫైనల్ పోటీలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను అభిమానించే నాయకులు, కార్యకర్తలు లభించటం తన అదృష్టమన్నారు. ఎంతో శ్రమకోర్చి చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించిన సంక్రాంతి క్రీడాసంబరాల్లో జిల్లా నలుమూలల నుంచి 2,500 మంది క్రీడాకారులు పాల్గొని వారి ప్రతిభను చాటుకున్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు తన అభినందనలు తెలిపారు. ఓటమి చెందిన క్రీడాకారులు నిరాశ చెందవద్దని, నేటి ఓటమి రేపటి విజయానికి నాందిగా భావించి ముందుకు సాగాలని సూచించారు.

యువతను ప్రోత్సహించాలి..

కొంత మంది సీనియర్ నాయకులు మతిస్థిమితం లోపించి పోయినంతకాలం అంతా తమదేనను కోవడం ఒట్టి భ్రమే అని సిద్ధార్థరెడ్డి అన్నారు. రాజకీయాల్లోకి వచ్చే కొత్తవారిని, యువకులను ప్రోత్సహించాలన్నారు. నిరంతరం తనకు అండగా ఉంటూ తన అభ్యున్నతికి పాటుపడుతున్న నియోజకవర్గ ముస్లిం సోదరులకు రుణపడి ఉంటానన్నారు. అనంతరం కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ముగ్గుల పోటీల విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసిసుధాకర్‌రెడ్డి, వైఎస్ చైర్మన్ ప్రశాంతి, జెడ్పీటీసీలు కలిమున్నిసా, పోచా జగదీశ్వరరెడ్డి, యుగంధర్‌రెడ్డి,



వాలీబాల్ విజేత జట్టుకు ట్రోఫి అందజేస్తున్న దృశ్యం

పుల్యాల దివ్య, ఎంపీపీలు మల్లు వెంకటేశ్వరమ్మ, మల్లీశ్వరి, సువర్ణమ్మ, కుసుమలత, దాసి అనసూయమ్మ, సలోమి, సూదిరెడ్డి రాధ, అఖిల్, స్వామిదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు తువ్వాశివరామకృష్ణారెడ్డి, చంద్రమౌళి, శాప్ జిల్లా కోఆర్డినేటర్లు రవికుమార్, పెరుమాళ్ల శ్రీనాథ్, రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

జూపాడుబంగ్లా: నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని, ఇందుకు ఎంతవరకైనా పోరాడుతానని శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం అల్లూరు గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మూడేళ్లకాలంగా గ్రామాల్లో కనిపించని టీడీపీ నాయకులు ఎన్నికలు సమీపిస్తున్నకొద్ది గుర్తింపుకోసం గ్రామాల్లో తిరుగుతూ, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకుల తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కబ్జాలు చేసి గడించిన రూ.కోట్ల డబ్బును ఎన్నికల్లో వెదజల్లి గద్దెనెక్కేందుకు టీడీపీ నాయకులు యత్నించే అవకాశాలున్నాయని, వారి ప్రలోభాలకు ఏమాత్రం తలొగ్గవద్దని సూచించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే మరోమారు ఆయనను సీఎం చేస్తాయన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కలిమున్నిసా, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైఎస్ ఎంపీపీ మంజుల, సర్పంచులు రవియాదవ్, జనార్దన్‌గౌడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామకృష్ణారెడ్డి, కాటం ప్రభాకర్ రెడ్డి, సతీష్‌రెడ్డి వేదవతమ్మ, పాపన్న, ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల శ్మశానవాటికకు రోడ్డు



ముస్లింలతో కలిసి దువా చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్‌లోని పూర్ణానందస్వామి ఆశ్రమం సమీపంలో ఉన్న ముస్లిం మైనార్టీల శ్మశాన వాటికకు సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భూమిపూజ చేశారు. జీఎస్‌డీ నిధులలో విడతల వారీగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. మొదటి విడతగా రు.5,00,000లతో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మైనారిటీ నాయకులు మాట్లాడుతూ ఖబ్రస్థాన్‌కు స్థలాన్ని కేటాయించడంతో పాటు బోరును కూడా తవ్వించారని, ప్రస్తుతం రోడ్డు నిర్మాణానికి నిధులను కేటాయించారనన్నారు. ఇందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.రజాక్, స్థానిక నాయకులు భరత్‌రెడ్డి, మహమ్మద్ ఖాశీం, ముస్లిం మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, డి.గౌస్‌మొహిద్దీన్, ఎస్‌ఏ.జావెద్, నూర్ మహ మ్మద్, మహమ్మద్ ఖాజీమౌలానా, ఏఎస్.ఇస్మాయిల్, ఆరిఫ్, ఎస్‌కె.ఖాజా తదితరులు ఉన్నారు.

మల్లన్న సేవలో ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే శిల్పాకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, అర్చకస్వాములు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యే శిల్పాకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.



ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే

మహానందిలో నేడు ..

మహానంది: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహానందిలో ఆదివారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లకు విశేష అభిషేకార్చనలు, ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16వ తేదీన కనుమ సందర్భంగా పార్వేట ఉత్సవం, ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు.

రమణీయం.. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం



శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివార్లకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తరిగోపుల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివార్ల కల్యాణాన్ని భక్తులు శనివారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పన్నీటితో స్నానం చేయించారు. అనంతరం వేదమంత్రాల మధ్య పురోహితులు ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలతో అలంకరించారు. వధూ, వరులుగా ముస్తాబైన స్వామి, అమ్మవార్ల ప్రతిమలను పెళ్లిపీటలపై కూర్చుండబెట్టి వేదమంత్రాల మధ్య కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనులారా వీక్షించిన భక్తులు తరించిపోయారు. అలాగే శ్రీఅనంత నాగేశ్వరస్వామివారికి పంచామృతాభిషేకాలు, బిల్వార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు.

నేడు రథోత్సవం

స్వామివారికి ఆదివారం సాయంత్రం రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏడి.వెంకటరమణ, ఆలయ ధర్మ కర్త చిన్న కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. రథోత్సవం అనంతరం పలుసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

భోగభాగ్యాల భోగి

వెలుగోడు: దక్షిణాయనంలో పడ్డ కష్టాలు, బాధలను భోగి మంటల రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణ కాలంలో సుఖసంతోషాలను ప్రసాదించాలనే పరమార్థమే భోగి పండుగ విశిష్టత అని పురోహితులు వివరించారు. ఈ పండుగ వస్తూ వస్తూ సంవత్సరానికి సరిపడా ధాన్యాన్ని వెంటతెస్తుందని.. భోగ భాగ్యాలు ప్రసాదించే పండుగతోనే సంబరాలు మొదలవుతాయని తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా ప్రజలు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పల్లెల్లో భోగి మంటల కాంతులు విరజిమ్మాయి. తెల్లవారుజాము నుంచే ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గు లు వేస్తూ చిన్నాపెద్దా సందడి చేశారు. ఈ సందర్భంగా పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ భోగి మంటల విశిష్టతను వివరించారు. సాధారణంగా చలికాలం కాబట్టి వెచ్చదనం కోసం భోగి మంటలు వేస్తారని భావిస్తారని, కానీ ఇది వెచ్చదనం కోసం మాత్రమే కాదు, ఆరోగ్యం కోసం కూడా తెలిపారు. ధనుర్మాసం నేలంతా ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారని, వాటినే ఈ భోగి మంటలలో వాడుతారన్నారు. ఆవుపేడతో చేసిన పిడకలని కాల్చడం వల్ల గాలి శుద్ధి అవుతుందని.. సూక్ష్మక్రిములు నశించి, ఆక్సిజన్ గాలిలోకి అధికంగా విడుదలవుతుందని చెప్పారు. భోగి మంటల్లో రావి, మామిడి, మేడి మొదలైన ఔషధ చెట్ల కలప, ఆవు నెయ్యి వేస్తారని, ఈ ఔషధ మూలికలను ఆవు నెయ్యి, ఆవు పిడకలతో కలిపి కాల్చడం వల్ల విడుదల అయ్యే గాలి అతి శక్తివంతమైనదని.. ఇది ఒకరకంగా అగ్ని దేవుడికి ఆరాధన, మరోరకంగా గాలిని శుద్ధి చేస్తూ వాయుదేవునికి ఇచ్చే గౌరవం కూడా అని వివరించారు.



తాటిపాడులో ఇంటిముందు రంగుల ముగ్గు వేస్తున్న మహిళలు



చూపరులను ఆకట్టుకొనేలా ఇంటి ముందు తీర్చిదిద్దిన రంగవల్లి

ఊరూరా వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం గ్రామాల్లో భోగి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు తెల్లవారుజామున భోగిమంటలను వేసుకొని చలికాచుకున్నారు. ఉదయాన్నే ఇళ్ల ముందు కళ్లాపిచల్లి రంగురంగుల రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలను ఉంచి మహిళలు ఇళ్ల ముంగిళ్లను అలంకరించారు. అనంతరం నువ్వులరొట్టెలు, వంకాయ కూర తో పాటు రకరకాల కూరలు, పిండివంటలతో భోగి పండుగను జరుపుకున్నారు. ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవటంతో పాటు పంటలు సమృద్ధిగా పండటంతో రైతులు ఆనందోత్సవాల మధ్య మరకసంక్రాంతి పండుగను జరుపుకుంటున్నారు.

ఢీ అంటే ఢీ

పగిడ్యాల: సంక్రాంతి తిరుణాలను పురస్కరించుకుని పడమర ప్రాతకోట కాశీవిశ్వేశ్వర, నందీశ్వర స్వామి దేవాలయం వద్ద శనివారం రాత్రి నిర్వహించిన జిల్లా స్థాయి రెండు పళ్ల పొట్టేలు పందెం పోటీలను ఎస్ఐ నాగార్జున ప్రారంభించారు. పోటీల్లో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి 14 జతల పొట్టేళ్లు పాల్గొన్నాయి. ప్రాతకోట శ్రీకాంత్ పొట్టేలు, గోరుకల్లు మణికి చెందిన పొట్టేళ్లు పోటా పోటీగా ఢీ కొన్నాయి. చివరకు గోరుకల్లు మణి పొట్టేలు విజేతగా నిలిచి మొదటి బహుమతిని సొంతం చేసుకుంది. రెండవ విజేతగా ప్రాతకోట శ్రీకాంత్ పొట్టేలు నిలిచింది. మూడవ విజేతగా దామగట్ల లడ్డు పొట్టేలు నిర్వాహకులు ప్రకటించారు. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ. 4 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యి నగదు బహుమతిని నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ అస్లాంబాషా, సహకార సొసైటీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మిద్దె మోక్షం, రమణ ప్రసాద్, అంబటి శివశంకర్‌రెడ్డి, కురువ మల్లయ్య, అలీబాషా, అమీర్‌బాష తదితరులు పాల్గొన్నారు.



పోటాపోటీగా తలపడుతున్న పొట్టేళ్లు

వాహనాల పార్కింగ్ స్థలం పరిశీలన

మహానంది: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భక్తుల వాహనాల పార్కింగ్ కోసం అవసరమైన స్థలాన్ని శనివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈఓ మాట్లాడుతూ గతంలో మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాలకు ఆలయానికి దూరంగా పార్కింగ్ ఏర్పాటు చేసేవారమన్నారు. అయితే ప్రస్తుతం దేవస్థానానికి చెందిన భూములను అభివృద్ధి చేసి శాశ్వత ప్రాతిపదికన వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేశామని చెప్పారు. రూరల్ సీఐ రవీంద్ర పార్కింగ్ ప్రదేశానికి చేరుకుని పలు అంశాలపై చర్చించారు. టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాల పార్కింగ్ ప్రత్యేకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పునరుద్ధరించాలి

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ యాక్ట్‌ని పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, న్యాయవాది రవికుమార్ కోరారు. శనివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ యాక్ట్ ఈ ఏడాది జనవరిలో ముగియనుందని చెప్పారు. దళితులకు అభివృద్ధికి, అభ్యున్నతికి ఉపయోగపడే ఈ యాక్ట్‌ను ప్రభుత్వాలు యథావిధిగా కొనసాగించాలన్నారు. దేశంలో దళితులు ఇంకా అంటరాని వారుగాను, ఆర్థికంగా వేనుబాడటమే కాకుండా రాజకీయాల్లో గుర్తింపులేక మగ్గిపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు సగినెల సురేష్, తలారి నాగారాజు, అబ్రహాం, అంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్

ముగిసిన బైబిల్ శిక్షణ తరగతులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చిలో బైబిల్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. గత నాలుగు రోజులుగా క్రైస్తవ చిన్నారులకు బైబిల్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ముగింపు సందర్భంగా చిన్నారులు తలపై కిరీటాలు ధరించి పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో భోదకులు ఉదయ్ కుమార్, రఘుబాబు, ప్రేంసాగర్, సుకుమార్, తిరుమల్, నిర్వాహకులు బి.దేవసహాయం, పవన్, నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా స్థానిక జీపీఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమై గిరిజన తండాలు, ఎరుకల కాలనీలు, చెంచుగూడేలు, యానాది కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. 15న అవుకు, బనగానపల్లె మండలాల్లో రెండు రోజుల పాటు, 17న నంద్యాల, ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో పర్యటిస్తారని వివరించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో నంద్యాల జట్టు ప్రతిభ

గన్నవరం: కృష్ణా జిల్లాలోని గన్నవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల 37వ సబ్ జూనియర్, 44వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల విజేతగా విశాఖపట్నం, రన్నర్స్‌గా నంద్యాల జట్లు నిలిచాయి. జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో కర్నూలు, విజయనగరం జట్లు, సబ్ జూనియర్స్ విభాగంలో అనంతపురం, తూర్పు గోదావరి జట్లు తృతీయ స్థానం సాధించాయి. అనంతరం వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు ఒలింపిక్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రావు, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన హ్యాండ్‌బాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా అసోసియేషన్‌ను కేపీ రావు అభినందించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి జె.సింహాచలం, కోశాధికారి టి.శిరీష, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

26న ట్రాక్టర్ల ర్యాలీ

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లాలో ఈనెల 26వ తేదీన చేపట్టనున్న ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు.

నేడు ప్రాతకోటలో రథోత్సవం

పగిడ్యాల: సంక్రాంతి తిరునాలను పురస్కరించుకుని తూర్పు, పడరమ ప్రాతకోట గ్రామాల్లోని నాగేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి గుర్రెడ్డి శనివారం తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఇతర ప్రముఖులు హజరవుతారని తెలిపారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రథోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

రథోత్సవ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున సూచించారు. శనివారం రెండు గ్రామాల్లోని దేవాలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. రథోత్సవ నిర్వహణకు అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను విద్యుత్, గ్రీన్ అంబాసిడర్స్ తొలగించారు. అలాగే దేవాలయ ఆవరణతో పాటు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును టెక్నిషియన్‌తో రీ చెకప్ చేయించి పనిచేసేలా చర్యలు చేపట్టారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. దేవదాయ శాఖ ఆహ్వాన పత్రికలో ప్రకటించిన సమయానికే రథాన్ని లాగాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో రేలా రేలా, ఆర్కెస్ట్రా నిర్వహణకు అనుమతి లేదని, పోలీసు ఆదేశాలను బేఖాతర్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కమిటీ సభ్యులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ నాగార్జున

అ'పూర్వ' సమ్మేళనం

పగిడ్యాల: మండల పరిధిలోని పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 1998–99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 23 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులు అందరూ ఒక వేదికపై హాజరై తమ జ్ఞాపకాలను ఒకరునొకరు పంచుకుని ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున హాజరై పలు సూచనలు చేశారు. విద్యకు మించిన సంపద లేదని పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చదిద్దడమే తల్లిదండ్రుల కర్తవ్యమన్నారు. అలాగే 1998–99 బ్యాచ్‌కు విద్యను బోధించిన ఉపాధ్యాయులను, ఎస్ఐ నాగార్జునను సన్మానించారు. చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తైమూర్‌బాషా, పూర్వపు ఉపాధ్యాయులు నారాయణ, సుధాకర్, వెంకటరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, రవీంద్రానాథ్‌రెడ్డి, రామిరెడ్డి, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, చౌడేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ నాగార్జునను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బైక్‌ల దొంగ అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో పలు ప్రాంతాల్లో ఐదు బైక్‌ల చోరీకి పాల్పడిన నిందితుడిని తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ వలి ఆటోనగర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు ఎక్కువగా ఉండటంతో మెకానిక్ పని చేసిన డబ్బులు సరిపోకపోవడంతో చోరీలకు పాల్పడ్డాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నంబరు ప్లేట్లు లేని వాహనాలను దొంగలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఆటోనగర్ సమీపంలో నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. చోరీకి గురైన బైక్‌లను స్వాధీనం చేసుకొని మహమ్మద్ వలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.